క్లుప్తంగా

జగ్గిరెడ్డిని కలిసిన పెద్దిరాజు



చీఫ్‌విప్ చిర్ల జగ్గిరెడ్డితో వైఎస్సార్ సీపీ నాయకులు

పోడూరు: ప్రభుత్వ చీఫ్ విప్ చిర్ల జగ్గిరెడ్డిని శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో పోడూరు మండలానికి చెందిన ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలనీ, అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించినట్లు పెద్దిరాజు తెలిపారు. జగ్గిరెడ్డిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు మురళి, కొండేటి రవి తదితరులున్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



లంకలకోడేరులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై కె.శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: హెల్మెట్ పెట్టుకోవడం వలన ప్రాణాలకు రక్షణ కవచంలా పని చేస్తుందని రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లంకలకోడేరులో శుక్రవారం మోటార్ వాహనదారులకు అవగాహన కల్పించారు. మార్చి 1 నుంచి విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని, లేని పక్షంలో చలానా రాస్తామని హెచ్చరించారు. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు తిరిగి ఇంటికి వెళ్లే వరకు వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



సిద్ధాంతంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్‌ను సిద్ధాంతం చెరువు పేటలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. 30 జట్లు పోటీ పడుతుండగా విజేతకు రూ.33,333 నగదు బహుమతి, ద్వితీయ విజేతకు రూ.22,222 ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సర్విశెట్టి వర్ధంతి



సర్విశెట్టి విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న మహిళా కళాశాల సిబ్బంది

నరసాపురం రూరల్: పట్టణంలోని బీజీబీఎస్ మహిళా కళాశాల వ్యవస్థాపకుడు, స్త్రీ పునర్వివాహ ఉద్యమ నేత పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి 32వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సర్విశెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ అద్దేపల్లి సేవలను మహిళా లోకం మరచిపోలేదని అన్నారు. రాయపేటలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న సర్విశెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజీబీఎస్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నీరజ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పొగతో ఇబ్బంది



డంపింగ్‌యార్డు నుంచి వస్తున్న పొగ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డు నుండి వచ్చే పొగతో స్థానికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. డంపింగ్ యార్డులో అంటుకున్న మంటలతో గత రెండు రోజులుగా యథేచ్ఛగా పొగ వస్తుంది. దీనిపై స్థానికులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెత్తలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలు, మెడికల్ వంటి విషపూరితమైన రసాయనాలు నుంచి వెలువడే పొగతో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై మునిసిపల్ శానిటరీ అధికారులు వాటర్ ట్యాంకులతో చెత్తను తడుపుతున్నారు. పక్కనే ఉన్న ఫైర్ అధికారులు, సిబ్బంది వచ్చి పొగను నిలుపుదల చేయడానికి మునిసిపల్ అధికారులకు సహకరిస్తామని తెలిపారు. డంపింగ్ యార్డులో చెత్తను బాగా లోతుగా తడిచేలా చేయాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు అంటుకుంటే అంత త్వరగా నిప్పు ఆరదని అందువల్ల ఎక్కువ మోతాదులో తడపాల్సి ఉంటుందని తెలిపారు. పొగను అదుపులోకి తీసుకువచ్చేందుకు శానిటరీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న వలంటీర్ల సేవాగుణం

- దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ల అందజేత
- కృతజ్ఞతలు చెబుతున్న లబ్ధిదారులు



విశాఖపట్టణం వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పాలపర్తి మనీషా



గుంటూరు వెళ్లి వికలాంగ పింఛన్ అందిస్తున్న వలంటీర్లు జ్యోతి, లావణ్య



ఏలూరు వెళ్లి పింఛను అందిస్తున్న పెనుగొండ వలంటీరు గంగా భవానీ

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురం సౌత్ గ్రామానికి చెందిన కొల్లాబత్తుల ప్రభుదాసు గుండెకు బైపాస్ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం విశాఖ పట్టణంలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఉంటున్నారు. దీంతో ఈ నెల పింఛన్ ఇచ్చేందుకు ఆయన ఇంటికి వెళ్లిన వలంటీర్ పాలపర్తి మనీషా ఆపరేషన్ విషయాన్ని తెలుసుకుంది. అనంతరం తన సోదరుడు పెద్దరాజు సహకారంతో శుక్రవారం విశాఖపట్టణం వెళ్లి ప్రభుదాసుకు పింఛన్ అందజేసింది. పింఛన్‌దారు ప్రభుదాసుతోపాటు వారి కుటుంబ సభ్యులు సైతం అనారోగ్య కారణంగా పొరుగు ఊరిలో ఉంటున్నప్పటికీ ఆసుపత్రికి వచ్చిమరీ పింఛన్ అందించిన వలంటీర్ మనీషాతో పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజులని అభినందించారు. ఇదిలా ఉంటే ఈ నెల 1న రాజమండ్రి వద్దాది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిచ్చుక లక్ష్మికి కూడా రాజమండ్రి వెళ్లి వితంతు పింఛన్ సొమ్మును అందించింది. ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న పింఛన్ దారులకు సైతం క్రమంతప్పకుండా పింఛన్ అందిస్తున్న వలంటీర్ మనీషాను పలువురు అభినందిస్తున్నారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత

పాలకొల్లు సెంట్రల్: జిల్లా దాటివెళ్లి మరీ మహిళా వలంటీర్లు శుక్రవారం లబ్ధిదారుడికి పింఛన్ అందించారు. పాలకొల్లు పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వికలాంగుడు వీఎస్‌వీ సత్యనారాయణ అనారోగ్యం రీత్యా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంతం వలంటీర్ శెట్టి జ్యోతి తన సహ వలంటీర్ మేకా లావణ్యను తోడుగా తీసుకుని బుధవారం గుంటూరు వెళ్లి సత్యనారాయణకు రూ. 3 వేలు వికలాంగ పింఛన్ అందించింది. మహిళా వలంటీర్లు గత రెండు నెలల నుంచి ఇంత దూరం వచ్చి పింఛన్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని లబ్ధిదారుడు సత్యనారాయణ ఆనందం వ్యక్తంచేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వలంటీర్లు సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా నిబద్ధతను చాటుకుంటున్నారు. పెనుగొండకు చెందిన పూతినీడి తాతయ్య అనారోగ్యంతో ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటుంది. ఈ నేపథ్యంతో ఈ నెల పింఛన్ ను వలంటీరు కంకిపాటి గంగాభవానీ ఏలూరు స్వయంగా వెళ్లి అందించింది. అలాగే ఆచంట మండలం కొడమంచిలికి చెందిన వలంటీరు మాతా మౌనిక తన క్లస్టర్ పరిధిలోని పింఛను లబ్ధిదారు అంజూరి సత్తెమ్మ అనారోగ్య ఇబ్బందితో తణుకులో బంధువుల వద్ద ఉండడంతో వారి ఇంటికి వెళ్లి పింఛను అందించింది. మాతా మౌనికను నాయకులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

లయన్స్ క్లబ్ సభ్యులకు అవార్డులు

పాలకొల్లు సెంట్రల్: లయన్స్ డిస్ట్రిక్ట్ అవార్డుల కార్యక్రమంలో పాలకొల్లు లయన్స్ క్లబ్‌కు 17 అవార్డులు వచ్చినట్లు క్లబ్ అధ్యక్షుడు ముచ్చర్ల వెంకట సత్యనారాయణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. మంగళవారం రాత్రి తణుకు లయన్స్ క్లబ్‌లో డిస్ట్రిక్ట్ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2021-22 సంవత్సరానికి గానూ వివిధ విభాగాల్లో అవార్డులు అందజేశారన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చల్లా ఆదినారాయణమూర్తి, మాజీ అధ్యక్షులు కట్టా రామకృష్ణ, శిడగం సతీష్, మాగం నారాయణరావు, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, నందుల సీతారామారావు పాల్గొన్నారు.

ధర్మ నిధి కరపత్రాల ఆవిష్కరణ

నరసాపురం రూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మ నిధి ధర్మ రక్షా నిధి సేకరణ చేయాలని ముఖ్య అతిథి ఎం.కుమారస్వామి అన్నారు. శుక్రవారం నరసాపురం పట్టణంలోని స్టీమర్ రోడ్డులోని శ్రీరాజ గోపాలస్వామి ఆలయం వద్ద నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ నరసాపురం డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మరక్షా నిధి కరపత్రాలను ఆవిష్కరించారు. కటకంశెట్టి గోవర్ధన్. మల్లాడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ



డీఈఓ ఆర్ వెంకటరమణ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న యలమంచిలి విద్యార్థినులు

యలమంచిలి: భీమవరం పట్టణంలోని చింతలపాటి బాపిరాజు హైస్కూల్‌లో గురు, శుక్రవారాలలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో యలమంచిలి మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. మొత్తం ఐదు థీమ్‌లలో పోటీలు జరుగగా యలమంచిలి మండల విద్యార్థులు మూడు థీమ్‌లలో ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలంలోని మట్లపాలెం పేరిచర్ల సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాచమళ్ల మధుమతిశ్రీ పర్యావరణ హిత పదార్థాల విభాగం (థీమ్-1లో) ప్లాస్టిక్ కుండీలకు బదులు భూమిలో కలసి పోయే మెంతులు, మొక్కజొన్న పిండి, కొబ్బరిపొట్టు, పేపర్ సహాయంతో తయారు చేసిన కుండీలకు ప్రథమ బహుమతి వచ్చింది. పర్యావరణ, వాతావరణ మార్పుల విభాగం (థీమ్-4లో) అదే పాఠశాల విద్యార్థి చెల్లుబోయిన లీలా సత్య శ్రీనాథ్ తయారు చేసిన ప్లాస్టిక్ బాటిల్స్ నుంచి తాడు తీసి ఆ తాడుతో వైర్ కుర్చీలు, వైర్ మంచాలు, బూజు కర్రలు తయారుచేసిన ప్రాజెక్ట్‌కు ప్రథమ బహుమతి వచ్చింది. కొత్త ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, పాత ప్లాస్టిక్ రీ సైక్లింగ్ చేయడం ఈ ప్రాజెక్ట్ ఉద్దేశమని శ్రీనాథ్ చెప్పాడు. యలమంచిలి తాళ్లూరి నారాయణస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు పి.చాందిని అలేఖ్య, ఎం.భవిత ఆరోగ్యం పరిశుభ్రత విభాగం (థీమ్-2లో) గ్రామంలో పరిసరాలను ఏ విధంగా శుభ్రంగా ఉంచాలో వివరిస్తూ ప్రదర్శించిన ప్రాజెక్టుకు, యోగా, వ్యాయామం, మంచి ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, చెడు వ్యసనాలకు ఏ విధంగా ఉండాలో ఇచ్చిన వివరణకు ప్రథమ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులకు డీఈఓ ఆర్ వెంకటరమణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు మేడిశెట్టి వెంకట గణేష్ (మట్లపాలెం), కట్టుంగ వెంకట సుబ్బారావు (యలమంచిలి)లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామేశ్వరపు సత్యనారాయణ, చింతా చిట్టిబాబులు అభినందించారు.

ఎరువుల షాపుల తనిఖీ



లంకలకోడేరులో ఎరువుల షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

పాలకొల్లు అర్బన్: డీలర్లు రైతులకు ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని నరసాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు అనిల్‌కుమారి, పాలకొల్లు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.పార్వతి హెచ్చరించారు. పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎరువుల షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. అలాగే లైసెన్స్‌లు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను కొన్ని షాపుల్లో పరిశీలించగా ఎరువుల వ్యత్యాసం తేడా ఉన్నట్లు గుర్తించారు. ఎరువుల డీలర్లకు దీనిపై పలు సూచనలు చేశారు. పట్టణంలోని, మండలంలోని అన్ని షాపుల్లో తనిఖీ నిర్వహిస్తామని అధికారులు సూచించారు. వీరితో పాటు వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం ఉన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం ఉండాలి



గర్ల్స్ ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు చదువుతోపాటు ఆటల్లోనూ ప్రావీణ్యం ఉండాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. శుక్రవారం స్థానిక భాష్యం పాఠశాలలో గర్ల్స్ ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే శారీరకంగా, మానసికంగాను ఉల్లాసంగా ఉంటారని అంతేకాకుండా క్రమశిక్షణతో భవిష్యత్ లక్ష్యాలను సాధించుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్ స్వామి మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న 10 బ్రాంచ్‌ల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.లక్ష్మీకుమారి, భాష్యం వెస్ట్ జోన్ జెడ్ఈవో ఎ.శ్రీమన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన కల్పించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ వాకపల్లి ప్రసాద్

పెనుమంట్ర: ఆశ కార్యకర్తలు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వాకపల్లి ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన అలమూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో అలమూరు -1 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో పీహెచ్‌సీ వైద్యులు కొడాలి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది రోగులను పరీక్షించి మందులు ఇవ్వాలని సూచించారు. గర్భిణులకు ప్రోటీన్ పౌడర్‌లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.గంగూనాయుడు, ఎంపీహెచ్ఈఓ కె.రమేష్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్



జడ్జి ఉషా లక్ష్మీకుమారి

పాలకొల్లు సెంట్రల్: అందరికీ సమ న్యాయం అందాలనే ఉద్దేశంతో దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు స్థాపించిన జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి న్యాయ సేవాధికార సంస్థలు ద్వారా అందరికీ చట్టాలపై అవగాహన కల్పించే విధంగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ఉషా లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ ఫిబ్రవరి 11న కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్, మనోవర్తి, చెక్ బౌన్స్, ఫైనాన్స్, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ బాకాయిలు ఇలా అన్ని రకాల కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. చిన్న చిన్న తగాదాలకు మాట పట్టింపులకు పోయి విలువైన సమయాన్ని మరియు సొమ్మును వృథా చేసుకోకుండా కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవచ్చన్నారు. రాజీ చేసుకునే కక్షిదారులు కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలన్నారు.

బీజేపీ, జనసేన కలిసే పోటీ చేస్తాయి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారిని తాతాజీ, శ్రీనివాసవర్మ

పాలకొల్లు సెంట్రల్: భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీలు రెండూ వచ్చే ఎన్నికల్లో కలిసే పోటీ చేస్తాయని బీజేపి రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో జిల్లా అధ్యక్షులు నారిని తాతాజీ అధ్యక్షతన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాస వర్మ, జిల్లా అధ్యక్షులు తాతాజీ మాట్లాడుతూ బీజేపి ప్రజాపక్షాన్న పోరాటం చేస్తుందన్నారు. మార్చి 10వ తేది నుండి 31 వరకూ ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధుకర్, పాకా సత్యనారాయణ, కోమటి రవి, ఉమామహేశ్వరి, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ టీంకు ఎంపిక



బేస్ బాల్‌కు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పాలకొల్లు సెంట్రల్: కాకినాడ పీఆర్ కాలేజీలో ఈనెల 1న జరిగిన నన్నయ్య యూనివర్శిటీ బేస్ బాల్ మహిళల టీంకు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి శుక్రవారం తెలిపారు. బేస్ బాల్ టీంకు ఎంపికైన ఎస్‌కె జరీనా, పి లీలా కుమారి విద్యార్థినులు ఇద్దరూ ఈ నెల 24న గౌహతి (అస్సాం)లో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ బేస్ బాల్ టోర్నమెంట్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ ఎం రామకృష్ణ, పీడీ జి. మహేష్ తదితరులు అభినందించారు.

భక్తులకు ఉపయోగపడని పార్కింగ్ ప్రదేశం



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం పార్కింగ్ ప్రదేశంలో ఇతర వాహనాలు, కార్లు పార్కింగ్

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి మరీ భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. లక్షలాది రూపాయల ఆదాయం కేటాయించిన పార్కింగ్ ప్రదేశంలో భక్తులకు ఉపయోగపడడం లేదు. ఆలయానికి ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారస్తుల వాహనాలు వారి వద్ద కొనుగోలు చేయడానికి వచ్చే వినియోగదారుల కార్లు, మోటార్ వాహనాలను ఈ ప్రాంతంలో పార్కింగ్ చేయడం వల్ల ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలు పెట్టుకోవడానికి ఉండడం లేదని భక్తులు వాపోతున్నారు. తమ బళ్లు పెట్టుకోవడానికి అక్కడున్న వాహనాలు పక్కకు పెడుతుంటే తమపై దెబ్బలాటకు వస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆలయానికి వచ్చే ఇంత ఆదాయం వదులుకుని ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు పెట్టుకోవడానికి లేకపోతే ఎలా అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై దేవస్థానం ఈఓ యాళ్ల సూర్యనారాయణను వివరణ కోరగా సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. పోలీసుల సహకారం తీసుకుని ఆలయం నుంచి ఒక మనిషిని పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాటుచేసి ఆలయంలోకి వచ్చే భక్తుల వాహనాలు మాత్రమే ఇక్కడ పార్కింగ్ చేసే విధంగా కఠిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యను క్షుణ్ణంగా అభ్యసించాలి

నరసాపురం రూరల్: ఇంజినీరింగ్ విద్యాభ్యాసంలో ప్రాథమిక అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసినప్పుడే లక్ష్యాలను చేరుకోగలరని సాఫ్ట్‌వేర్ నిపుణులు వై ప్రశాంత్ అన్నారు. మండలంలోని సీతారాంపురం స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్కోప్ ఆఫ్ ఇంజినీరింగ్ అనే అంశంపై జరిగిన గెస్ట్ లెక్చరర్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ సాంకేతిక అంశాలపై శ్రద్ధ చూపాలన్నారు. తద్వారా భవిష్యత్తులో వచ్చే అడ్డంకులను అధిగమించవచ్చన్నారు. అలాగే ప్రతీ విద్యార్థి రెండు ప్రోగ్రాం లాంగ్వేజ్‌లను నేర్చుకుంటే భవిష్యత్‌లోఎన్నో అవకాశాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, పాలకవర్గ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కేపీ పాలెంలో పౌర్ణమి ధ్యానం

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌లోని పాండురంగ స్వామి ఆలయం వద్ద ఆదివారం పౌర్ణమి ధ్యానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కెవిడి ప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు రాత్రంతా పౌర్ణమి ధ్యానం కార్యక్రమం ఉంటుందని పాల్గొనాలనుకునే వారు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

8న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

మొగల్తూరు: స్థానిక అందేబాపన్న జూనియర్ కళాశాలలో నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ శుక్రవారం విలేకరులకు తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డులు వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.

జిన్నూరులో దోమల మందు పిచికారీ



దోమలమందు పిచికారి చేస్తున్న దృశ్యం

పోడూరు: మండలంలోని జిన్నూరు గ్రామంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో దోమలమందు పిచికారీ చేశారు. సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు పనులను పరిశీలించారు.

రిటైర్డ్ ఎస్సై మూర్తి మృతి



బీఎస్ఎన్ మూర్తి

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్సై బొర్రా సత్యనారాయణమూర్తి (68) మృతి చెందినట్లు శుక్రవారం బంధువులు తెలిపారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మూర్తి గురువారం రాత్రి మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆచంట ఎస్సైగా పని చేస్తూ ఎనిమిదేళ్ల క్రితం రిటైరయ్యారు.

పేకాట స్థావరంపై దాడి

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పడమరలో పేకాట స్థావరంపై శుక్రవారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 8మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ5960లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ రాజేంద్రర్ తెలిపారు.

లక్ష్యం మేరకు స్త్రీ నిధి రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం శశికుమార్

మొగల్తూరు: లక్ష్యం మేరకు స్త్రీనిధి రుణాలందించేందుకు కృషి చేయాలని స్త్రీనిధి ఏజీఎం పి.శశి కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రూ.8.07 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు సుమారు రూ.6 కోట్లు అందించగా, జిల్లాలో ఇప్పటి వరకూ 45,338 మంది మహిళలకు రూ.184.57 కోట్లు రుణాలుగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్లు శ్రీరామ్,సతీష్, సీసీలు సుదర్శన్, సోమరాజు, ఆనందకుమారి తదితరులు పాల్గొన్నారు.